
కథ

# నెలజీతం



సోమవర్ఝుల నాగేంద్ర ప్రసాదు

రామారావు రైల్వేలో హెడ్‌క్లర్క్‌గా పని జేస్తున్నాడు. అతని భార్య భావన. అతనికి ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి నాల్గవ తరగతి, రెండవది మొదటి తరగతి చదువుతున్నారు. అందరిలాగే అతనిది కూడా ఓ మధ్యతరగతి కుటుంబమే. నెలనెలా వచ్చే జీతం రాళ్ళే ఆధారం. అలా అని దేనికి లోటు లేదు. పెళ్ళైన పదేళ్ళలోపే ఇంటికి కావాల్సిన సామానులు,ఫ్రిజ్,కలర్ టీవీ, మ్యూజిక్ సిస్టమ్, డబుల్‌కాట్ మంచం, వాషింగ్ మిషన్ వగైరా, వగైరాలు సమకూర్చుకొన్నాడు.

రామారావు రాత్రి భోజనం చేసి పేపరు చదువుతున్నాడు. పిల్లలు ప్రక్కరూములో టీవీ చూస్తున్నారు. వంటింట్లో పనులన్నీ ముగించుకొచ్చిన భావన అతనికి మజ్జిగ గ్లాసు అందిస్తూ, ఏవండీ మీకు జీతం ఎంత వస్తుందండీ, అమాయకంగా అడిగింది భావన.

మజ్జిగ గ్లాసు అందుకొన్న రామారావు ఆమెవంక ఆశ్చర్యంగాను, అనుమానంగా చూస్తూ 'ఏంటి భావనా, ఏనాడూ లేనిది ఈరోజు, నువ్వు నా జీతం గురించి అడుగుతున్నావు"ఏంటి సంగతి ! నవ్వుతూ అన్నాడు.

'అబ్బా... ఆ నవ్వాపి ముందర మీ జీతం ఎంతో చెప్పండి', కొంచెం విసుగ్గా అడిగింది.

'సరేలేవోయ్, ఈ మాత్రం దానికి అంత కోపమెందుకు', ఇంతకీ నా జీతం చేతికొచ్చేదా లేక మొత్తం ఎంత వస్తుందో

అదా... అడిగాడు రామారావు.

'అదేంటి ! జీతాలు రెండు రకాలుగా ఉంటాయా....?' అమాయకంగా మొహం పెట్టి అడిగింది భావన.

ఓసి వెర్రి మొహమా... రెండు జీతాలు ఉండవు. మనకొచ్చే మొత్తాన్ని 'గ్రాస్ సేలరీ' అంటారు. అలాగే కటింగులు పోను మనచేతికొచ్చే దాన్ని 'నెట్ సేలరీ' అంటారు, విడమర్చి చెప్పాడు రామారావు.

ఏమో బాబూ... నాకు ఇవేమీ తెలియవు గాని, మీకు వచ్చే మొత్తం జీతం చెప్పండి చాలు అంది భావన.

'భావనా...! నాకు ఇంచుమించు పద మూడు వేలుదాకా వస్తాయి, చెప్పాడు రామారావు.

'పదమూడు వేలే' మరైతే నేనేమి కావాలన్నా, ఈనెల కాదు, వచ్చే నెల చూద్దాం అంటూ ఎందు కండీ దొంగ నాటకాలాడతారు, రోషంగా అంది.

నిజంగా నాకు చేతికి నువ్వనుకొన్న పదమూడు వేలు వస్తాయనుకొంటున్నావా ? పిచ్చిదానా...! అన్ని కటింగులు పోను నాకు మహా అయితే చేతికి ఏ ఐదారువేలో వస్తాయి, చెప్పాడు రామారావు.

'కటింగులా...?' కటింగులంటే.... తెలియని దానిలా అడిగింది భావన.

కటింగ్‌లంటే... పి.ఎఫ్, వీపీఫ్, ఇన్సూరెన్స్ వగైరా, వగైరాలన్నమాట.

అన్ని కటింగులు చేయించుకోపోతేనేమండి. హాయిగా మొత్తం జీతం ఇంటికి తెస్తే రాజాలా చక్కగా బ్రతకొచ్చు గదా, అతనికి తెలియని విషయం చెప్పినదానిలా ఫోజు పెట్టింది భావన.

ఇది మరీ బావుంది, మొత్తం జీతం మనకి ఎవరిస్తారు? అడిగాడు రామారావు.

అదేంటండీ... మీ జీతం మీ ఇష్టం. మధ్యలో వాళ్ళెవరండీ, పూర్తి జీతం ఇవ్వకపోవ డానికీ?, నిలదీసింది భావన.

ఆమె అమాయకత్వానికి నవ్వాలో, ఏడవాలో తెలియని రామారావు 'అది కాదు భావనా....! గవర్నమెంటు మనకిచ్చే జీతంలో ఇంత పర్సెంట్ పి.ఎఫ్ క్రింద జమ చేయాలి. ఆపై మనిష్టం మనం ఎంత కావాలనుకొంటే అంత విపిఎఫ్ క్రింద కట్ చేయించుకోవచ్చును. అదీ కాక మనకి ఇన్సూరెన్స్ అవసరం కదా అందుకని అందు నిమిత్తం జీతం నుండి కొంత కట్ అవుతుంది. ఇన్ని కటింగులు పోను మిగిలినదే మన చేతికి వస్తుంది. దానినే నెట్ సేలరీ అంటారు', పూర్తిగా తన సేవింగ్స్ తాలూకు వివరాలు చెప్పాడు రామారావు.



ది 30-5-2008 నాడు హైదరాబాద్ త్యాగరాయ గానసభలో 'చెలిమి సాంస్కృతిక సమితి' వారి ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ప్రముఖ కవి శ్రీ సి.నారాయణరెడ్డిగారి చేతుల మీదుగా "ప్రతిభామూర్తి పురస్కారం" అందుకుంటున్న కవి పి.శ్రీనివాసగౌడ్. చిత్రంలో చెలిమి సాంస్కృతిక సమితి వ్యవస్థాపకులు శ్రీ పి.ఎం. సుందరరావు ఉన్నారు.

ఏవండీ...! పి.ఎఫ్ అంటే ఏమిటండీ...? అడిగింది భావన.

పి.ఎఫ్ అంటే, ప్రావిడెంట్ ఫండ్, భవిష్యనిధి... అర్ధం చెప్పాడు రామారావు.

అబ్బా నేనడిగింది తెలుగు అర్ధం కాదండి. పి.ఎఫ్ అంటే ఏమిటి, మళ్ళీ అదే ప్రశ్న వేసింది భావన.

చెప్పాను గదా, భవిష్యనిధి అని, కొంచెం విసుగ్గా అన్నాడు రామారావు.

మహానుభావా.. ఆ అర్ధం నాకూ తెలుసు. ఐతే మీకు భవిష్యనిధికి సంబంధం ఏమిటి? అ( మనకు ఎందుకు ఉపయోగిస్తుంది కొంచెం విడమర్చి అర్ధం అయ్యేలా చెప్పొచ్చు కదా, విసుక్కొంది భావన.

ఆమె భావాన్ని అర్ధం చేసుకున్న రామారా చిన్నగా నవ్వి, ఓసి వెర్రిదానా పిఎఫ్ అంటే మనం దాచుకొన్న డబ్బుని, ఎప్పుడైనా మన అవసరాల నిమిత్తం వాడుకొనేందుకు ముందు జాగ్రత్తగా ప్రభుత్వం మనచేత ఇలా సేవింగ్ చేయిస్తుంది. అలా దాచిన డబ్బు నుండి మన అవసరాలకి కావాల్సిన దానిని మనం లోనుగా తీసుకోవచ్చును. లేదంటే మనం రిటైర్ అయినపుడు ఏకమొత్తంగా దానిమీద వడ్డీ వేసి ఇస్తారు, చెప్పాడు రామారావు.

అంటే మధ్యలో మనకి అవసరం అయినప్పుడు తీసుకోవచ్చునా? అడిగింది భావన.

ఆహా.. నిక్షేపంలా తీసుకోవచ్చును. అయితే అవసరం అన్నా కదా అని అన్నింటికి ఇవ్వరు, చెప్పాడు రామారావు.

ఆ పి.ఎఫ్‌లో అంతలా దాచుకోవల్సిన అవసరం ఏముందండి, అడిగింది భావన.

అదేంటి భావనా.. అలా అంటావు. రేపొద్దున్న మన పిల్లల చదువుకు, వాళ్ళ పెళ్ళిళ్ళకు డబ్బు ఎక్కడనుండి వస్తుంది? ఆ టైములో ఇబ్బందులు పడకూడదనే ఈ పొదుపు చెప్పాడు రామారావు.

ఏమిటో ఇప్పుడిలా కడుపు మాడ్చుకొని, ఎప్పుడో వాళ్ళ పెళ్ళిళ్ళకోసం దాస్తారట సణిగింది. అవునూ మీరు అవసరం అయితే లోను ఇస్తారు అన్నారు కదా, ఏమేమి అవసరాలకి ఇస్తారండి, తెలుసుకోవాలని అడిగింది.

అదా... అవసరాలు అంటే మన ఇంట్లోకి కావాల్సిన వస్తువులు, అంటే ఫ్రిజ్, టీవీ లాంటి వన్నమాట. అలాగే భూమిగాని, ఇల్లుగాని, లేకపోతే మనమీదే ఆధారపడిన వారి పెళ్ళి నిమిత్తం గాని, పిల్లల చదువులు నిమిత్తం గాని దీంట్లోంచి లోను ఇస్తారు, చెప్పాడు రామారావు.

మరి నగా, నట్రా కొనుక్కోవడానికి ఇవ్వ రాండి? అమాయకంగా అడిగింది.

చూడు భావనా ! నగానట్రా అన్నవి ఆడంబరాలే కానీ, అవసరాలు కాదు. కాబట్టి అటువంటి వాటికి పి.ఎఫ్ లోను ఇవ్వరు, నవ్వుతూ అన్నాడు రామారావు.

అతని నవ్వు చూసి భావన మూతి ముడుచుకొని, సరేలెండి ఆ వెధవ రూల్సు అన్నీ నాకెందుకు కానీ, ఇంతకీ మీ చేతికి వచ్చే జీతం గురించి చెప్పండి, మళ్ళీ మొదటికే వచ్చింది.

అసలు విషయం అర్థంగాని రామారావు, ఇవాళ నీకు ఏమైంది భావనా? ఏనాడు అడగంది, ఈనాడు నా జీతం గురించి గుచ్చి గుచ్చి మరీ అడుగుతున్నావు. నీ మనసులోని మాటే మిటో సూటిగా చెప్పచ్చు గదా, విషయం తెలుసుకొనే ప్రయత్నం చేసాడు.

అబ్బా... మెల్లిగా మాట్లాడండి అవతల పిల్లలు వింటారు, అతనిమీద విసుగుని ప్రదర్శించింది భావన.

పర్వాలేదులే, వాళ్ళు వినరులే కాని, ఇంతకూ ఎందుకు నా జీతం గురించి అడిగావు, మరలా తానే విషయాన్ని తెలుసుకోవాలనే ఆతృతతో అడిగాడు.

ఏం లేదండీ... ఈనెల నుండి నేనే ఇంటి ఖర్చుల వ్యవహారాలు చూద్దామనుకొంటున్నానండి, మెల్లిగా అసలు విషయాన్ని బైటపెట్టింది భావన.

ఓసోస్... అదా సంగతి. చాలా బావుంది భావనా ! ఐతే ఇంతకు ముందు కూడా ఒకసారి నువ్వు ఇలాగే అన్నావు. తీరా ఒకనెల మన ఇంటి ఖర్చుల సంగతి చూసి, అమ్మో నేను ఈ తలనొప్పులు పడలేను మీరే చూసుకోండి అన్నావు గుర్తుందా? గుర్తుచేసాడు రామారావు.

అన్నాను. ఐనా అప్పుడు మీ జీతం ఇంత లేదుగా, అందుకే అలా అన్నాను. మీరు నా చేతికి జీతం ఇచ్చినట్లే ఇచ్చి, పాలవాడికి ఇంతివ్వాలి, కిరాణావాడికి ఇంతివ్వాలి, ఇంటి అద్దె ఇంతివ్వాలి అని ఇచ్చిన డబ్బులు అన్నీ మీరే తీసేసుకొనేవారు, అవునా అడిగింది భావన.

నిజమే భావనా... మరి మన ఇంటి ఖర్చులకు నాకు వచ్చిన జీతం నుండి కాకపోతే మరి ఎక్కడనుండి ఇస్తాము? ఇటు మా వాళ్ళు గాని, అటు మీ వాళ్ళు గాని మనకి వేరే ఆస్తులేమి ఇవ్వలేదుగా, ఆమెను ఆటపట్టిస్తూ అన్నాడు.

మీరిలా దెప్పుతారనే నేను ఆ ఖర్చు వ్యవహారాలు చూడనన్నది. మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది భావన.

మరైతే మళ్ళా ఇవాళ ఎందుకు ఇంటి ఖర్చులు చూద్దం సంగతి ఎత్తావు, వ్యంగ్యంగా అన్నాడు రామారావు.

ఏం లేదండి ! మా చెల్లి వాళ్ళాయన తనకి వచ్చిన జీతం మొత్తం మా చెల్లికే ఇచ్చి నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకో, వాడికి ఇంతివ్వాలి, వీడికి ఇంతివ్వాలి వంటి తలనొప్పి వ్యవహారాలు నాకు చెప్పొద్దు అంటాడటండీ.

విషయం పూర్తిగా అర్థమైన రామారావు చూడు భావనా...! 'నువ్వనుకొన్నట్లు డబ్బు వ్యవహారాలు చూడడం అంత ఈజీ కాదు', అ.. అన్నట్లు నీకు పనిమనిషికి, పాలవాడికి, ఇంటి అద్దె ఇవ్వమని డబ్బులు ఇచ్చాను గదా ఇచ్చేసావా? అడిగాడు రామారావు.

లేదండి.. ఇంకా ఇవ్వలేదు. అయినా ఇవాళే కదా నెల పూర్తయింది. ఒకటి రెండురోజుల్లో ఇస్తాను లెండి, ఎంతో క్యాజువల్‌గా అంది భావన.

అదేంటి భావనా... వాళ్ళు నెలంతా కష్టపడి పనిజేస్తున్నది ఈ డబ్బుల కోసమే కదా, అదీ గాక ఇవాళ కాకపోతే రేపైనా వాళ్ళ డబ్బులు వాళ్ళ కివ్వాలిగా? అడిగాడు రామారావు.

ఆమాత్రం నాకూ తెలుసులెండి. ఐనా ఇలా నెల పూర్తైన వెంటనే డబ్బులు ఇచ్చేస్తే ఇంక మన విలువేముంటుంది?

అంటే..., అర్థం కాక అడిగాడు రామారావు.

అదేనండి, వాళ్ళు ఒకటి రెండు సార్లు అడిగితేనే గాని ఇవ్వకూడదండి. అప్పుడే వాళ్ళకి మన విలువ తెలుస్తుంది. అలాగే మనం చెప్పినట్లు వింటూ, పనులు శుభ్రంగా చేస్తారు, చిదంబర రహస్యం చెప్పింది భావన.

'ఇది చాలా అన్యాయం', ఇంకా ఏదో చెప్పబోయాడు రామారావు.

మీకేమీ తెలియదు మీరూరుకోండి. మన పనిమనిషి ఇంకా ఐదారుగురి ఇళ్ళల్లో చేస్తోంది. అలాగే మన పాలవాడూను. ఆటోవాడు గూడా మన పిల్లలతో పాటుగా వేరేవాళ్ళపిల్లల్ని తీసుకొని వెళ్తున్నాడు. అందుచేత వాళ్ళకి ఇవ్వాల్సిన డబ్బులు కొంత లేటుగా ఇచ్చినా పర్వాలేదు, తన వాదనను సమర్థించుకొంటూ అంది భావన.

సరే భావనా.... నువ్వన్నది నిజమే, అయితే మిగతావాళ్ళు కూడా నీలాగే ఆలోచించి, సమయానికి జీతం ఇవ్వకపోతే వాళ్ళకెంత ఇబ్బంది అవుతుందో ఏనాడైనా ఆలోచించావా? అడిగాడు రామారావు.

మీకు తెలియదన్నానా, అనవసరంగా మీరు ఈ వ్యవహారంలో తల దూర్చకండి. మీపని డబ్బులు ఇవ్వడమే, ఎప్పుడు ఎవరికి ఇవ్వాలో అప్పుడే ఇస్తాను. ఈ విషయంలో అనవసరంగా ఉచిత సలహాలు, ఉపన్యాసాలు ఇవ్వనవసరం లేదు, ఖచ్చితంగా చెప్పింది భావన.

ఇంక ఈ విషయంలో ఆమెకు హరిహర బ్రహ్మాదులు కూడా నచ్చ చెప్పలేరని తెలిసిన రామారావు, 'సరే భావనా నీ యిష్టం, నీ యిష్టం వచ్చినట్లుగా చేసుకో, రేపొద్దున్న ఈ విషయమై నీకు వాళ్ళకి మాటా మాటా వస్తే నాకు చెప్పద్దు', నచ్చ చెప్పబోయాడు.

ఏంటి పనిమనిషిని, పాలవాడిని అంతలా వెనకేసి కొస్తున్నారు. అయినా పనిమనుషుల సంగతి, పాలవాళ్ళ గొడవ మీకెందుకండి, నోరు మూసుకొని ఊరుకోండి, ఎన్నడూ లేనిది ఆ రోజు ఆ విషయమై అతనితో గొడవకు దిగింది భావన.

ఇది మరీ బావుంది, డబ్బు అవసరం ఎవరికైనా ఒకటే కదా అని అలా చెప్పాను. దానికోసం నువ్వు నాతో ఇలా గొడవ పడడం ఏమీ నాకు

## చినుకులు -ఏవీఎమ్




మోనగలేవి ! పరమాత్మా !!
నువ్వు తపస్సుకి కూర్చోకముందు
పెద్ద గజదొంగవి కదా ! అందుకే ఇలా వచ్చా !

నచ్చలేదు. కొంచెం గట్టిగానే అన్నాడు రామారావు.

విషయం చిలికి చిలికి గాలివాన అవు తోందని గ్రహించిన భావన తానేతగ్గి, సర్లెండి ఇప్పటికే పదయ్యింది. ఇంక పడుకోండి అంటూ పిల్లల్ని తీసుకురావడానికి ప్రక్కగదిలోకి వెళ్ళి పోయింది.

రామారావుకి పేపరు చదవబుద్ధి కాక నిద్రకుపక్రమించాడు. పడుకొన్నాడన్నమాటే కాని భావన వింత మనస్తత్వం గురించే ఆలోచిస్తున్నాడు. ఆమె ఎందుకిలా ఆలోచిస్తోంది... ఎంత ఆలో చించినా ఆమె మనస్తత్వం అతనికి అర్థం కాలేదు. అవే ఆలోచనలతో ఉన్న అతనికి ఎప్పటికో నిద్ర పట్టింది.

✿ ✿ ✿

'ఏవండి...... ఈనెల మీకింకా జీతం రాలేదా....?' ఉన్నట్టుండి ఆఫీసు నుండి వచ్చిన రామారావుని అడిగింది భావన.

ఏం అలా అడిగావు. ఇవాళ ఇంకా రెండో తారీఖు, అన్నాడు రామారావు.

అబ్బే ఏం లేదు, ఇంతవరకు మనం పని మనిషికి గాని, పాలవాడికి గాని, ఆటోవాడికి గాని ఇంకా డబ్బులు ఇవ్వలేదు, గుర్తుచేసింది భావన.

నాకూ తెలుసు భావనా. కానీ ఈనెల జీతం రావడం కొంచెం లేటవుతుంది, ఎందుకంటే మార్చి నెల జీతం ఏప్రిల్‌లో ఇస్తారు. కొంచెం నువ్వే వాళ్ళకి సర్ది చెప్పు, కూల్‌గా చెప్పాడు రామారావు.

అయ్యో ఇప్పుడు ఎలాగండి? ఈ రోజు ఉదయమే పనిమనిషి జీతం ఇవ్వనందుకు ఎంతో నిష్ఠూరంగా మాట్లాడింది, చెప్పింది భావన.

ఏమందేం? అడిగాడు రామారావు.

ఆ ఏమంటుంది, పని చేయించుకొన్నప్పు డున్న ఇది జీతాలు ఇచ్చేటప్పుడు ఉండదని, అదోలా మాట్లాడింది.

మరి నువ్వేమన్నావు? అడిగాడు రామా రావు.

ఏమంటాను అయ్యగారికి ఇంకా జీతం రాలేదు, వచ్చిన వెంటనే ఇచ్చేస్తానని. ఐనా అలా చెప్పడానికి నాకు ఎంతో సిగ్గేసిందండి.

మరి వెయ్యదు, నెల అయిపోయిన వెంటనే వాళ్ళ డబ్బులు వాళ్ళకి ఇచ్చేసెయ్యి అంటే విన్నావా. నాకేమి తెలియదన్నట్లు మాట్లాడావు. మరిప్పుడెలా ఆమెని ఎదురు ప్రశ్నించాడు.

ఎలా అంటే ఎలాగండి. ఇంట్లో సరుకులు నిండుకొన్నాయి తెచ్చుకోవాలని మరీ మరీ చెప్ప డంతో, రేపు ఉదయం ఇస్తానని నచ్చచెప్పి పంపిం చాను, అందుచేత మీరే ఎలాగోలా సర్దాలండి, ప్రాధేయపడింది భావన.

ఇప్పటికైనా నీకు తెలిసిందా భావనా... వాళ్ళకి ఈ జీతం రాళ్ళే ఆధారం అని. మనం టైముకి జీతం ఇస్తేనే గాని వాళ్ళింట్లో పొయ్యిలోని పిల్లి లేవదని, అవకాశంగా తీసుకొని ఆమెకు అర్థం అయ్యేలా చెప్పాడు రామారావు.

నిజమేనండి, నేను మీలా అంత లోతుగా ఆలోచించలేదండి అంటూ తన తప్పుని ఒప్పుకుంది భావన. ఏవండి ఇకనుండి, నెల పూర్తవగానే ఎవరి డబ్బులు వారికి ఇచ్చేస్తానండి. ఎవరికి ఏం అవసరా లుంటాయో మనకి తెలియవుగదా. అలాగే వాళ్ళ డబ్బులు మన దగ్గర ఓ రెండురోజులు ఉన్నంత మాత్రాన మనకి ఒరిగేది ఏమీ లేదు, చెప్పింది భావన.

నువ్వన్నది అక్షరాలా నిజం భావనా! ఒకరి కష్టాన్ని మనం ఎప్పటికి ఉంచుకోకూడదు అంటూ జేబులో నుండి పనిమనిషికి, పాలవాడికి, ఆటోవాడికి ఇవ్వాల్సిన డబ్బులు ఆమె చేతికి ఇచ్చాడు రామారావు.

అబ్బా ఎంత కంగారు పెట్టేసారండి. జీతం తెచ్చే ఈ దొంగనాటకాలాడారన్నమాట. ఐనా ప్రతి నెలా ఠంచనుగా నెలాఖరునే ఎవరికివ్వాల్సిన డబ్బులు ఇచ్చేయమని ఇచ్చే మీరు, ఈ నెల కావాలనే, నాకు తెలిసిరావాలనే జీతం తెచ్చి కూడా ఇవ్వలేదు గదూ, మూతి ముడుచుకొంటూ అంది భావన.

నువ్వనుకొన్నది కొంతవరకు నిజం. అయినా నీకు ముందే చెప్పానుగా, మార్చినెల జీతం ఏప్రిల్‌లో వస్తుందని. నిన్ననే జీతం డ్రా చేసాను. నీకు ఇద్దామనే అనుకొన్నాను. కాని నిన్న సాయంత్రం నీకు పాలవాడికి మధ్య జరిగిన సంభాషణ విన్న తరువాత నీ రియాక్షన్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని, కావాలనే డబ్బులు ఇవ్వలేదు, నిన్ను బాధపెట్టి ఉంటే నన్ను మన్నించు అంటూ నాటక ఫక్కీలో చెప్పాడు రామారావు.

భలేవారండి, మీరు చేసిన దాంట్లో తప్పు ఏదైనా ఉంటే తప్పకుండా క్షమిస్తాను. ఐనా మీరు చెప్పదల్చుకొన్నది, ఎవరు కష్టపడినా ఈ జీతంరాళ్ళ కోసమనే గదా. అలాగే మన అవసరాలు, బాధలు ఎలాంటివో, ఎదుటివారి బాధలు, అవసరాలుకూడా అలాంటివనే కదా, అతని మనస్తత్వాన్ని అర్థం చేసు కొన్నదానిలా హుందాగా చెప్పింది భావన.

చాలు భావనా, నువ్వు నన్ను చాలా బాగా అర్థం చేసుకొన్నావు. ఇంక నీకు నేనేమి వేరే చెప్ప నవసరం లేదు అంటూ ఆమె వంక మెచ్చుకోలుగా చూసాడు రామారావు.

## శేషేంద్ర శర్మ ప్రథమ వర్ధంతి సభా విశేషాలు



శేషేంద్ర శర్మ ప్రథమ వర్ధంతి మే 30న త్యాగరాయ గానసభ (హైదరాబాద్)లో జరిగింది. ఆచార్య ముదిగొండ శివరామప్రసాద్ అధ్యక్షత వహించగా ప్రముఖకవి, పాత్రికేయులు ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డా॥పోరంకి దక్షిణామూర్తి, ప్రముఖ కథకులు శ్రీ మునిపల్లె రాజు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, తనికెళ్ళ భరణి, నగ్నముని తదితరులు వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి శేషేంద్ర ప్రథమ స్మారకోపన్యాసం చేశారు. సభలో శేషేంద్ర రచనలు లిప్యాల కథలు, మబ్బుల్లో దర్బారు నాటిక, ఋతుఘోష, మండే సూర్యుడు పుస్తకాలు శేషేంద్రపై గింజల నరసింహారెడ్డి రాసిన శేషేంద్ర ధనువు కావ్యాలు ఆవిష్కరించారు. ఈ సభలో పాల్గొన్న ప్రముఖ రచయిత శ్రీ రావూరి భరద్వాజ మాట్లాడుతూ శేషేంద్ర కుమారుడు సాత్యకిని ఉద్దేశించి "శేషేంద్ర ట్రస్టు" ఏర్పాటు చేస్తే బాగుంటుదన్నారు. మంచి సాహిత్యానికి ఈ ట్రస్టు అంకితమైతే అదే శేషేంద్రకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. సాధన సాహితీ స్రవంతి, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శేషేంద్ర ప్రథమ వర్ధంతి సభకు 'సాధన' నరసింహాచారి, కవి కతారి రాజు, యువభారతి అధ్యక్షులు శ్రీ అనంతాచార్యులు, శేషేంద్ర కుమారుడు సాత్యకి నిర్వాహకులుగా పనిచేశారు. పలువురు శేషేంద్రకు ఘనంగా నివాళులర్పించారు.